



గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద ప్లాస్టిక్ నిషేధం



ప్లాస్టిక్ కవర్లను ట్రక్కులో తరలిస్తున్న కూలీలు

బుట్టాయగూడెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వద్ద ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించారు.అమ్మ వారి దర్శనానికి వచ్చే భక్తులు మొక్కుబడులు చెల్లించి బంధువులకు విందు ఇస్తారు. భోజనాలు చేసిన ప్లేట్లను, గ్లాసులను ఎక్కడపడితే అక్కడ పడేయడంతో ఆలయ ప్రాంగణం ప్లాస్టిక్ వస్తువులతో నిండిపోతోంది. పక్కనే చెత్త కుండీ లున్నా భక్తులు ప్లేట్లను, గ్లాసులను వేయడం లేదు. ఆలయ పరిసరాల్లో రోజూ కూలీలతో శుభ్రం చేయిస్తున్నారు. అటవీ చట్టాల ప్రకారం ప్లాస్టిక్ వస్తువులు అడవిలో నిషేధం. భక్తులు అటవీ శాఖ తెలిపిన బయోకవర్స్‌ను మాత్రమే వాడాలి. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



గరుడ గమన తవ చరణ కమలమివ

బ్రహ్మోత్సవాలలో భాగంగా గరుడ వాహనంపై వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని తీసుకువస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు తదితరులు -6లో..

ఆర్పీలను అడ్డుకునేదెవరు ?



- అక్రమాలు వెలుగుచూస్తున్నా పట్టించుకోని మెప్మా అధికారులు
- రికవరీలపై దృష్టి సారించరు.. విచారణల్లోనూ సర్దుబాట్లు..
- అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలకు ఎమ్మెల్యే ఆదేశాలు
- నిబంధనలు ఒప్పుకోవంటూ బేఖాతర్.. నివ్వెరపోతున్న జిల్లావాసులు

8

గంగపుత్రులకు.. అండగా



- చేపలు వేటాడుతూ మృతి చెందిన మత్స్యకార కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం

6



కొల్లేరులో పక్షుల సందడి

6



వంకాయలను సాగు చేయలేం

6

ఎన్నాళ్లీ కష్టాలు..?

వర్షం వస్తే చెరువవుతున్న ఏలూరుపాడు గరువు ప్రాంతం

ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్‌కు మార్గం సుగమం

జేఎల్పీ నెంబర్లలోనూ అనుమతిచ్చిన ప్రభుత్వం



- గ్రామ స్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే రాయితీలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జాయింట్ ఎల్పీ నెంబర్లు వున్న ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్‌కు వెసులుబాటు లభించింది. మొన్నటి వరకు ఈ చెరువుల రిజిస్ట్రేషన్‌కు రైతులు అంతగా ఆసక్తి చూపలేదు. మరోవైపు కొన్ని చెరువులకు జాయింట్ ఎల్పీ నెంబర్లు ప్రతిబంధకంగా మారాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి నుంచి కలెక్టర్ వరకు సీరియస్‌గా దృష్టి పెట్టడంతోపాటు జేఎల్పీ నెంబర్ల సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఎల్పీ నెంబర్లు కేటాయించేలా రెవెన్యూ శాఖ రీసర్వే చేస్తోంది. ఆక్వా చెరువులకు హద్దులు లేకపోవడంతో అందులోవున్న భూయజమానులు అందరికి జాయింట్ ఎల్పీ నెంబర్లు కేటాయించారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పడాలో చెరువులు రిజిస్ట్రేషన్‌కు ఇది ప్రతిబంధకంగా మారింది. జిల్లాలో 23 వేల జాయింట్ ఎల్పీ నెంబర్లు (జేఎల్పీ)లో చెరువులు విస్తరించాయి. దాదాపు 52 వేల ఎకరాలు జేఎల్పీ నెంబర్లలో ఉన్నాయి. వాటి పరిష్కారానికి సర్వే విభాగం చర్యలు చేపట్టింది. అంతవరకు చెరువులు రిజిస్ట్రేషన్ నిలిచిపోకుండా జేఎల్పీ నెంబర్లతోనూ రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది.

మరోవైపు నాన్ ఆక్వా జోన్ పరిధిలోని చెరువులను జోన్ పరిధిలోకి తీసుకువచ్చే ప్రక్రియ తుది దశకు చేరింది. దీనివల్ల జిల్లాలోని అన్ని చెరువుల రిజిస్ట్రేషన్‌కు మార్గం ఏర్పడింది. గతంలో 50 వేల ఎకరాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరో 85 వేల ఎకరాల్లో చేసుకోవాల్సి ఉంది. దీనికోసం మత్స్య శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇటీవల ఆరు వేల ఎకరాల్లో కొత్తగా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. చెరువులన్నీ అప్పడాలో నమోదు చేసుకునేలా అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. వాస్తవానికి

(మిగతా 8వ పేజీలో)

హమ్మయ్య

కుక్కునూరు మండలంలో తీరిన టీచర్ల కొరత.. 96 పోస్టులు భర్తీ

కుక్కునూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులు ఇక నుంచి సక్రమంగా సాగనున్నాయి. ఇటీవల డీఎస్సీ ద్వారా మండలంలో కొత్తగా 96 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయి. వేసవిలో మండలం నుంచి 60 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక చదువులు సాగని పరిస్థితి ఏర్పడింది. చాలా పాఠశాలల్లో 60-90 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడే పాఠాలు చెప్పే పరిస్థితి. ఉపాధ్యాయుల కొరతపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు వెలువడ్డాయి. ఎట్టకేలకు ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు 11, ఎంఈవో పరిధిలో ఎస్జీటీ పోస్టులు 66, హైస్కూల్ పరిధిలో స్కూల్ అసిస్టెంటు పోస్టులు 15, ట్రైబల్ వెల్ఫేర్‌లో నాలుగు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయి. మోడల్ స్కూల్‌లో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఆరు నుంచి తొమ్మిది పోస్టులు భర్తీ అయ్యాయి. ఇక నుంచి పూర్తిస్థాయిలో విద్యాబోధన జరగ నుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాలకొల్లులో కార్తీకమాసం ఏర్పాట్ల సమీక్షలో కలెక్టర్ నాగరాణి

కార్తీక శోభతో కళకళలాడాలి

క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):'పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం నెల రోజులు కార్తీక శోభతో కళకళలాడాలి. ఆలయానికి వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి' అని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న కార్తీక మాసం ఏర్పాట్లపై మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలి. పూజా సామాగ్రికి మేదర బుట్టలను వినియోగించేలా ప్రచారం చేయాలి. భక్తులకు ఇబ్బంది లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి.' అని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఆర్డీవో దాసి రాజు, దేవదాయ శాఖ అధికారులు వి.హరిసూర్యప్రకాష్, ముచ్చర్ల శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ మీసాల రామచంద్రరావు(రాము), కమిషనర్ బి.విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏజీవై ఆదర్శ గ్రామాలపై సమీక్ష

భీమవరం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద జిల్లాలో మొదటి విడత 11, రెండో విడత 14 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ఎంపికచేశారు. ఈ గ్రామాల అభివృద్ధికి బడ్జెట్‌ను కేటాయించడంతో పనులు ప్రారంభించనున్నారు. ఈ పనుల ప్రణాళికలపై మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనపై సమీక్ష

భీమవరం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన అమలుపై కలెక్టర్ నాగరాణి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'కేంద్ర ప్రభుత్వం రెండేళ్లలో 3.5 కోట్లకుపైగా ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి 2027 జూలై 31వ తేదీ మధ్య కాలంలో కల్పించిన ఉద్యోగాలకు పథకం ప్రయోజనాలు వర్తిస్తాయ'ని కలెక్టర్ తెలిపారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 3,50,309 క్యూసెక్కుల జలాలను స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 29.150 మీటర్లు, స్పిల్‌వే దిగువన 19.500 మీటర్లు, భద్రాచలం వద్ద 21.60 అడుగుల నీటిమట్టం నమోదయ్యింది.

గూగుల్ అడుగుతో విశాఖలో టెక్ విప్లవం

తణుకు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):గూగుల్ సంస్థ రూ.87,500 కోట్ల పెట్టుబడితో విశాఖలో అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్ నిర్మించడానికి ముందుకు రావడం టెక్ విప్లవానికి నాంది అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విశాఖ నగరం ఏఐ, డిజిటల్ సిటీ రాజధానిగా కానుందని చెప్పారు. చంద్రబాబు దూరదృష్టితో మైక్రోసాఫ్ట్ సంస్థను హైదరాబాదుకు తీసుకురావడంతో రాష్ట్ర ఆర్థిక రూపురేఖలు మారాయన్నారు. గూగుల్ రావడంతో మన రాష్ట్రంలోని పిల్లలకు ప్రపంచస్థాయి అవకాశాలు వస్తున్నట్లేనని చెప్పారు.



ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

దేవాదిదేవా..శ్రీవాసుదేవా

వాడపల్లిలో ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

గరుడవాహనంపై ఊరేగిన వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన మంగళవారం ఆలయంలోని వసంత మండపంలో ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సప్త కలశారాధన, మహాస్నపనం, వసంతోత్సవాలను వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి పాదాల చెంత 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాదపద్మారాధనను కనుల పండువగా నిర్వహించారు. రాత్రి మలయప్ప అలంకరణలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. ఎమ్మెల్యే డ్రమ్స్ కొట్టి ఉత్సాహపరిచారు. మహిళల కోలాటం, నాగపూర్‌కు చెందిన బ్యాండ్ వాయిద్యాలు, ఉత్తరప్రదేశ్ కాశీకి చెందిన అఘోరాల విన్యాసాలు, తెలంగాణకు చెందిన బోనాలు, శక్తివేషాలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

కొల్లేరుకు విదేశీ అతిథులు

వలస పక్షుల రాకతో సందడి

కైకలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం ఇంటికి బంధువులు వచ్చినట్లుగానే ఈ సంవత్సరం కొల్లేరుకు విదేశీ అతిథులు రాక ప్రారంభమైంది. ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడడంతో కొల్లేరు సరస్సు నిండుకుండలా మారింది. పక్షులకు స్వర్గధామంగా మారింది. నీటితో పాటు విదేశీ పక్షులకు సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. ఇప్పటికే విదేశాల నుంచి పక్షులు వచ్చి సంతానోత్పత్తికి గూళ్ల నిర్మాణం ప్రారంభించాయి. మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరుకు ప్రతి సంవత్సరం వివిధ జాతులకు చెందిన పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణించి చేరుతూంటాయి. 77,136 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు అనేక జీవ జాతులకు ఆలవాలం. కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీరప్రాంతాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి వలసవచ్చిన వివిధరకాల పక్షులు కొల్లేరు శీతాకాలపు అతిథులుగా పర్యాటకులను ఆకర్షిస్తాయి. ఇప్పటికే వేలాది పక్షులు తరలిరావడంతో ఆటపాక పక్షుల కేంద్రం పక్షుల కిలకిల రావాలతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కొల్లేరు సరస్సులో చేపలను వేటాడి ఆహారాన్ని సంపాదిస్తున్న తీరు అబ్బురపరుస్తుంది. ఆడ,మగ పక్షులు జతకట్టి సమీప ప్రాంతాల నుంచి పుల్లలు ఏరుకుని గూళ్లు కట్టుకుంటున్నాయి. పెయింటెడ్ స్టార్క్, పెలికాన్‌తో పాటు ఎర్రకాళ్ళ ఉలసలు, తెల్ల, నల్ల కంకణాల పిట్టలు, జనకబాతులు, నీటికోళ్ళు, ఊది చెంచుకోడి, పెద్ద ఉల్లంకి పక్షులు సంతానోత్పత్తి చేసుకునేందుకు కొల్లేరు సరస్సు అనువైన ప్రదేశం. ఇప్పటికే పక్షులు వలస వచ్చి సంతానోత్పత్తి చేసుకున్నాయి.



ముళ్లచెట్లపై సేదతీరుతున్న పెయింటెడ్ స్టార్క్





కృత్రిమ స్టాండులపై సేద తీరుతున్న పక్షులు





తాటియాకులగూడెం సమీప జాతీయ రహదారిపై గోతుల్లో నిలిచిన నీరు..జీలుగుమిల్లి నాలుగు రోడ్ల కూడలి జగదాంబ ఆలయం వద్ద రోడ్డు దుస్థితి

గోతుల రోడ్లపై అవస్థలు

జీలుగుమిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సరిహద్దు తాటియాకుల గూడెం జీలుగుమిల్లి గ్రామాల్లో జాతీయ రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. చాన్నాళ్లుగా గిరిజన ప్రాంతంలో రహదారులు ధ్వంసం అయ్యి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల జాతీయ రహదారులు విస్తరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తాటియాకులగూడెం వయా జీలుగుమిల్లి మీదుగా కొత్తపట్టిసీమ వరకు కొత్తగా 369 కోట్లతో ఎన్‌హెచ్ 365 రహదారి నిర్మాణం పూర్తి చేసేందుకు ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే వర్షాకాలం కావటంతో విడతల వారీగా పనులు సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం సంగతి ఎలా ఉన్నా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర సరిహద్దు నుంచి తాటి యాకులగూడెం వయా జీలుగుమిల్లి మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లే ఎన్‌హెచ్ రహదారి గతంలోనే జాతీయ రహదారిగా ఎన్‌హెచ్ 516-డిగా గుర్తింపు పొందింది. తాటియాకులగూడెం నుంచి జీలుగుమిల్లి వరకు రెండు కిలోమీటర్ల మేర గల ఈ రోడ్డును ప్రస్తుత ఎన్‌హెచ్ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. ఏడాది క్రితం రహదారి మరమ్మతుల పేరుతో ఉన్న రోడ్డును పెకలించి ఇంతవరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయ్యలేదని స్థానికులు

ధ్వంసమైన గిరిజన రహదారులు

గోతులమయమైన తాటియాకుల గూడెం-జీలుగుమిల్లి రోడ్డు

చెబుతున్నారు. నెల రోజుల క్రితం ఎస్సై వి.క్రాంతికుమార్ జేసీబీతో గోతులు సరి చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు పెద్దవిగా మారాయి. తెలంగాణలో సత్తుపల్లి అశ్వారావుపేట, ముంపు మండలాలైన కుక్కునూరు వేలేరుపాడు మండలాల వాసులకు ఈ రహదారిపై ప్రయాణ ఇబ్బందులు తప్పడం లేదు.

నిధులు మంజూరైనా నిర్మాణం లేదు

ఇటీవల జీలుగుమిల్లి నుంచి మక్కినవారి గూడెం వయా చింతలపూడి వేళ్లే రహదారి గత 30 ఏళ్లగా నిర్మాణానికి నోచుకోలేదు. దీనికి ఇటీవల నాబార్డు సాయంతో రూ.3 కోట్లు ఎంపీ ఎమ్మెల్యేల ప్రోద్బలంతో నిధులు మంజూరు చేశారు. ప్రజా ప్రతినిధులు ఈ రహదారి నిర్మాణంకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా రహదారి పనులు ప్రారంభించ లేదు. దీంతో రహదారిపై ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. కాలం గడుస్తున్న కొద్ది గోతులు పెరిగి పెద్దవి అవుతున్నాయి. బర్రింకలపాడు నుంచి కామయ్యపాలెం మీదుగా రాచన్న గూడెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిది ఇదే పరిస్థితి . అడవీ ప్రాంతం కావటంతో ఈ రోడ్డుపై రాత్రి 7 గంటలు దాటితే ప్రయాణించే వారు కన్పించడం లేదు. రహదారి బాగోక కొందరు తెలంగాణలో రాష్ట్రం అశ్వారావుపేట మీదుగా రాచన్న గూడెం, అంకన్నగూడెం గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు. జీలుగుమిల్లి నుంచి వంకవారిగూడెం వెళ్లే మధ్య వాగు వద్ద కల్వర్టు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ప్రమాదం అంచున ద్విచక్ర వాహన దారులు ప్రయాణిస్తున్నారు. దాట్లవారిగూడెం, మడకం వారిగూడెం పండువారిగూడెం చీమలవారి గూడెం గిరిజన గ్రామాల వారు రాకపోకలు సాగించే వీలు లేకుండా పోయింది.



వంకవారిగూడెం వద్ద ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు



ఏలూరు తంగెళ్లమూడి లక్ష్మీనగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన వర్షం నీరు

వానొస్తే కాలనీ కాలవే !

విలీన గ్రామాల్లో నిలిచిపోతున్న వర్షపునీరు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీవర్షానికి ఏలూరు నగరంలో పలు కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లపై నిలిచిన నీటిని చాలా వరకు నీటిని తొలగించారు. విలీన గ్రామాల్లో పలు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోయింది. ఎక్కువగా ఖాళీస్థలాలు చెరువుల్లా మారాయి. వీటిని బయటకు తరలించేందుకు పారిశుధ్య సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షం వచ్చి 42 గంటలు దాటిన ఇంకా కాలనీల్లో వర్షపునీరు తొలగకపోవడంతో వృద్ధులు, మహిళలు పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తంగెళ్లమూడి సత్రంపాడు,శనివారపుపేట, వెంకటాపురం విలీన గ్రామాల్లో రోడ్లపైకి నీరు చేరాయి. తంగెళ్లమూడి లక్ష్మీనగర్‌లో రెండురోజుల నుంచి ప్రజలు వర్షపునీటితో ఇబ్బందులకు గురవుతున్నారు. ఖాళీస్థలాల్లో చెట్లు ఏపుగా పెరగటం, వాటి కింద నీరు నిల్వ ఉండటంతో దోమలు ప్రబలుతున్నాయి. పశువుల ఆసుపత్రి ఆవరణ, ఎదురుగా ఉన్నరోడ్లపై నీరు నిలిచిపోయింది. సహాయకచర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నగరంలో ఏడు విలీన గ్రామాలు కలవడంతో ప్రజలతో పాటు విస్తీర్ణం కూడా పెరిగింది. దానికి తగ్గట్టు పారిశుధ్య కార్మికులు పెరగలేదు.

సహాయక చర్యలు చేపడుతున్నాం

రెండురోజుల నుంచి సహాయక చర్యలు చేపడు తున్నాం. వర్షపు నీటిని తొలగిస్తున్నాం. కార్మికులు పగలు, రాత్రి నీటిని తొలగించే పనిలోనే ఉన్నారు. అధికారులంతా పర్యవేక్షిస్తున్నారు. డ్రైనేజీలు శుభ్రం చేస్తున్నాం. బుధవారం నాటికి పూర్తిస్థాయిలో నీటిని తొలగించే ఏర్పాట్లు చేస్తున్నాం. విలీన గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు కృషి చేస్తాం.



శివారెడ్డి, డిప్యూటీ కమిషనర్



బస్సు ఎక్కడానికి అవస్థలు పడుతున్న విద్యార్థులు

ఒక్క బస్సుతో విద్యార్థుల అవస్థలు

పెదవేగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒకే ఒక్క బస్సుతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సక్రమంగా కళాశాలలకు వెళ్లలేకపోతున్నారు. మంగళవారం ఉదయం పెదవేగిలో బస్సు ఎక్కడానికి అవకాశం లేక చాలామంది విద్యార్థులు ఆగిపోయారు. ఏలూరు నుంచి పెదవేగి మీదుగా రంగాపురం వరకు ఒకే బస్సు నడుస్తోంది. రంగాపురం నుంచి బాదరాల వచ్చేసరికే బస్సు పూర్తిగా నిండిపోతుంది. దీంతో రామశింగవరం, కూచింపూడి, న్యాయంపల్లి, పెదవేగి, లక్ష్మీపురం గ్రామాల్లో విద్యార్థులు బస్సు ఎక్కేందుకు అవకాశమే ఉండడం లేదు. దీంతో విద్యార్థులు అధిక వ్యయ, ప్రయాసల కోర్చి కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. కళాశాలల సమయాలకు అనుకూలంగా అదనంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఆర్టీసీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని అయినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగాపురం నుంచి గోపన్నపాలెం వరకు 15 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు ఒక్కటే ఆర్టీసీ బస్సు ఉండడంతో ముందుగా వచ్చే గ్రామాల్లోనే బస్సు నిండిపోవడంతో దిగువ గ్రామాల ప్రజలు బస్సు ఎక్కడానికి కష్టమవుతోంది.

ఎన్నాళ్లీ కష్టాలు..?

వర్షం వస్తే చెరువవుతున్న ఏలూరుపాడు గరువు ప్రాంతం

కాళ్ళ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ళుగా మురుగు నీటి సమస్యను ఎదుర్కొంటున్నా పంచాయతీ అధికారులుగాని, పాలకులు గాని కనీసం తమ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఏలూరుపాడు గరువు ప్రాంత వాసులు వాపోతున్నారు. వర్షాలు కురిస్తే మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కురిసిన ప్రతిసారి విష సర్పాలు ఇళ్ళల్లోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు పడుతూ లేస్తూ వెళ్ళాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. నీళ్ళు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల దోమలు ప్రబలి వ్యాధుల బారిన పడుతున్నామని తెలిపారు. ప్రతి ఏటా ఈ సమస్యను పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్ళినా శాశ్వత పరిష్కారానికి కనీసం చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి శాశ్వత పరిష్కారానికి మార్గం చూపాలని కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.అరుణాదేవిని వివరణ కోరగా స్థానికులు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, వెంటనే స్పందించి మురుగు నీటిని బయటకు మళ్ళించామని, సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు కూడా సిద్ధం చేశామని తెలిపారు.



నీటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్న పంచాయతీ సిబ్బంది



మొగల్తూరులో మెరక తోటల్లో సాగు చేసిన వంకాయలు

కలిసిరాని వంగ సాగు

తెగుళ్లతో పుచ్చుపట్టిన వంకాయలు

మొగల్తూరులో తోటలు వదిలేస్తున్న రైతులు

మొగల్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతమైన మొగల్తూరు మండలంలో పలు గ్రామాల్లో మెరక తోటల్లో సాగు చేసిన వంగ సాగు రైతులకు నిరాశ కలిగించింది. ప్రతీ ఏటా జూన్, జూలై నెలల్లో తీర గ్రామాల్లో వంగతోటలు పెంచడం అనవాయితీ. కార్తీక మాసం వచ్చేసరికి అధిక దిగుబడులు వచ్చి ఆదాయం బావుంటుందనే ఉద్దేశ్యంతో పలువురు ప్రత్యేకంగా వంగతోట సాగు చేపడుతుంటారు. మొగల్తూరు, రామన్నపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం, ముత్యాలపల్లి, కొత్తోట గ్రామాల్లోని మెరకభూముల్లో అంతర పంటగా లేక ప్రత్యేక పంటగా వంగ, తోటకూర, బీర, బెండ, దోస, దొండ సాగు చేస్తుంటారు. ఈ ఏడాది వంగతోటలకు వాతావరణం సానుకూలంగా లేకపోవడంతో తోటలు తెగుళ్ళ బారిన పడుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. దిగుబడికి వచ్చిన వంకాయలు రంగు అందంగా రావడానికి, పురుగు, పుచ్చు పట్టకుండా ఉండటానికి అనేక రకాల మందులు పిచికారీ చేసినప్పటికీ వంగ దిగుబడిలో పుచ్చుశాతం పెరిగిపోవడంతో సాగు ఖర్చులు, కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సుమారు నాలుగు మాసాలు కష్టపడి వంగతోటలు పెంచామని దిగుబడి వచ్చే సమయంలో పుచ్చులు రావడంతో అమ్ముకోలేని పరిస్థితి నెలకొందని తోటలు వదిలేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తోటలు పరిశీలిస్తాం : ప్రియదర్శిని, హార్టీకల్చర్ అధికారి

మొగల్తూరు తీరంలో వంగతోటల పెంపకం దారులు దిగుబడికి పుచ్చు వచ్చి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చిందన్న సమాచారం తెలిసింది. మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లో వంగతోటలు పరిశీలించి తగు సూచనలు చేస్తామని ఉద్యాన వనశాఖాధికారి ప్రియదర్శిని తెలిపారు.

ప్రకృతి ఒడిలో పోషకాలు

సీజన్‌కు ముందే వచ్చిన తేగలు

తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి): తాడి చెట్ల నుంచి సీజనల్‌గా లభించే తాటి ముంజులు, తాడి పండ్లు, వాటి నుంచి మొలిచే తేగలు సీజన్‌కు ముందే అందుబాటులోకి వచ్చాయి. తేగలు మన దక్షిణ భారత దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు రాష్ట్రాల్లో ఎక్కువగా దొరుకుతాయి. ఉభయ గోదావరి జిల్లాల్లోని గోదావరి తీర ప్రాంతాల్లో తేగల విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. ప్రస్తుతం తాడి పండ్ల నుంచి జ్యూస్‌ను తీసి తాటి రొట్టెలు, గారెలు, పోకుండలుగా మార్కెట్‌లో విక్రస్తున్నారు. తేగలు సాధారణంగా అక్టోబరు-డిసెంబరు నెలల్లో ఎక్కువగా లభిస్తాయి. ఇవి గ్రామీణ ప్రాంతాల్లో సంప్ర దాయ ఆహారంగా పరిగణిస్తారు. దీపావళి తర్వాత నాగుల చవితికి పుట్టలో తేగలను నైవేద్యం పెట్టిన తర్వాతనే తినడం ప్రారంభిస్తారు. అయితే కాలమానం మార్పుల్లో ముందుగానే తాటికాయలు రావడంతో తేగలు అందుబాటులోకి వస్తున్నాయి.

ఆరోగ్యానికి మేలు

తేగలలో అనేక ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు వున్నాయి. తేగలలో బీ1 థయామిన్, బీ2 రిబోఫ్లేవిన్, బీ3 రియాసిన్, సీ విటమినట్లు అధికంగా వున్నాయి. ఇవి శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తేగలలో లభించే పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, మొదలైన ఖనిజాలు ఎముకల ధృడత్వానికి, రక్తానికి మేలు చేస్తాయి. తేగలలో దాదాపు 60 శాతానికి పైగా పిండి పదార్థాలు, అధిక ఫైబర్ మిశ్రమం వుటుంది. దీని వల్ల జీర్ణక్రియకు సహాయ పడుతుంది. తేగల్లోని అధిక ఫైబర్ వలన మలబద్దకం, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. పెద్ద పేగుల్లోని మలినాలను బయటకు పంపేందుకు దోహదం చేస్తుంది. అయితే వీటిని మితంగానే తీసుకోవాలి. అధికంగా తీసుకుంటే జీర్ణ సమస్యలు రావచ్చు.



జాతీయ రహదారి పక్కన తేగల విక్రయాలు..తణుకు పాలంగి రోడ్డులో తాటి గారెలు, రొట్టెల అమ్మకాలు

- **చవితికి ముందే వచ్చాయి..**



సాధారణంగా అక్టోబరు, నవంబరు నెల నుంచి తేగల అమ్మకం ప్రారంభమవుతుంది. ఇప్పుడు తాటి చెట్ల నుంచి కాయలు ముందుగా కాయడంతో ముందుగానే పాతర వేయడం వల్ల నాగుల చవితికి ముందే తేగలు అమ్ముతున్నాం. సైజ్‌ను బట్టి పెద్దవి అయితే 10 నుంచి 12 ఉన్న కట్ట రూ.100, చిన్న సైజులో ఉన్నవి 8 నుంచి 10 తేగలను రూ. 50లకు అమ్ముతున్నాం.

-నార్గని శ్రీను, రెడ్డి చెరువు

- **సహజసిద్ధమైన ఆహారం**



తేగలు స్థానిక సంస్కృతికి చెందిన ముఖ్యమైన ఆహారం. తేగలు సహజ సిద్ధమైన పోషకాలతో కూడిన ఆహారం. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ ఆహారంగా పరిగణిస్తారు. పండుగల సమయంలో ఎక్కువగా లభిస్తుంది.తేగలను తాజాగానూ, నిల్వ చేసుకుని తినవచ్చు. దీనిలో పిండి పదార్థాలు, ఫైబర్ అధికంగా వున్నాయి. మనిషి ఆరోగ్యానికి అవసరమైన అన్ని విటమిన్లు, పోషకాలు తేగలలో సమృద్ధిగా వున్నాయి.

-గోపాలకృష్ణ ప్రసాద్, పోషకాహార నిపుణుడు, తణుకు

మత్స్యకార కుటుంబాలకు పరిహారం

కుటుంబానికి రూ.5 లక్షలు

వేటాడుతూ జిల్లాలో 12 మంది మృత్యువాత



నరసాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేటాడుతూ ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథకం (జీఏఐఎస్) కింద ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు చొప్పున పరిహారం అందించనుంది. దీనికి సంబంధించి జిల్లాలోని 12 మంది మత్స్యకారులకు సుమారు రూ.60 లక్షలు పరిహారం అందనుంది. ఇందులో నరసాపురంలో 5, మొగల్తూరు 4, భీమవరం, యలమంచిలి, ఆచంట మండలాల్లో ఒక్కరు చొప్పున ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకార కుటుంబాలకు పరిహారం అందించడం ఇది రెండోసారి.సముద్రం, గోదావరి, ఉప్పుటేర్లు, కాల్వల్లో వేటాడుతూ మత్స్యకారులు ప్రమాదబారిన పడి మృతి చెందుతున్న సంఘటనలు జిల్లాలో ఇటీవల ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. మూడేళ్ల క్రితం నరసాపురం మండలం బియ్యపుతిప్ప వద్ద సముద్ర వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా అలలు ఉధృతికి బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో బియ్యపుతిప్పకు చెందిన యువకుడు గల్లంతయ్యాడు. నేటికి మృతదేహం చిక్కలేదు. అయితే ప్రభుత్వం అధికారంలోకి రాగానే బాధిత కుటుంబానికి పరిహారం ఇచ్చారు.నాలుగు నెలల క్రితం నరసాపురం పట్టణం పొన్నపల్లి వద్ద సంప్రదాయ బోటుపై వేటాడుతుండగా బోల్తా పడింది. ఈ ఘటనలో మరో మత్స్యకారుడు మృతి చెందాడు.అలాగే మొగల్తూరు మండలంలో ఉప్పుటేర్లలో పడి ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. వీరిందరికి ప్రభుత్వం గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథకం కింద పరిహారం అందినుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పరిహారం తూతు మంత్రంగానే అందేది. అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా కూటమి ప్రభుత్వం 15 నెలల కాలంలో రెండుసార్లు బాధిత కుటుంబాలకు పరిహారం అందించింది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా మృతి చెందిన కుటుంబాలకు రూ.5.30 కోట్లు పరిహారం విడుదల చేసింది. అందులో జిల్లాలోని కుటుంబాలకు రూ.60 లక్షలు అందనున్నాయి. త్వరలో బాధిత కుటుంబాలకు చెక్కుల రూపంలో అందించనున్నారు.

నరసాపురంలో ఐదుగురికి పరిహారం

భారతి, మత్స్యశాఖ అధికారిణి

గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తాన్ని బాధిత కుటుంబాలకు త్వరలో అందిస్తాం. పట్టణ, మండలంలో వేటాడుతూ మృతి చెందిన వారు ఐదుగురు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని త్వరలో అందించనున్నాం. ఇంకా మండలంలో ఒక కుటుంబానికి పరిహారం మంజూరు కావాల్సి ఉంది. డాక్యుమెంట్లు సమర్పించగానే వారికి కూడా పరిహారం అందిస్తాం.

ఈకేవైసీ చేసుకున్న వారికే ఉపాధి పనులు

కాళ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికులు ఈకేవైసీ చేయించుకోవాలని, వారికి మాత్రమే ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఎంపీడీవో జి.స్వాతి తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ కార్మికులు ఫీల్డ్ అసిస్టెంట్లు ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలో 11,792 యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయన్నారు. అందులో 4854 (41.16 శాతం) జాబ్ కార్డులకు ఈకేవైసీ చేసినట్లు తెలిపారు. మిగిలినవారు ఈ నెల 20లోపు ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

బకాయిలు చెల్లించకుంటే విద్యుత్ కట్ : ఏడీఈ

ఆకివీడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో రూ.28.36 లక్షలు బకాయిలు ఉన్నట్లు విద్యుత్ ఏడీఈ ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆకివీడు మండలంలో రూ.17.20 లక్షలు, ఉండి మండలంలో రూ.5.96 లక్షలు, కాళ్ల మండలంలో రూ.28.36 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. వినియోగదారులకు బిల్లు ఇచ్చిన 14 రోజులకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు నెలలు నుంచి ఈ బకాయిలు పేరుకు పోయాయన్నారు. తమ సిబ్బంది గ్రామాలు తిరుగుతున్నారని, బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కార్యక్రమలో ఏఈ రత్నాకర్ ఉన్నారు.


గోడ పత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ నాగరాణి


వార్డులో పారిశుధ్యం, సమస్యలు పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

పట్టణ ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించాలి

భీమవరం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల జీవనోపాధికి మెప్మా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో 'మెప్మా లైవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్ గోడపత్రికను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. పట్టణ ప్రాంత ప్రజలు వ్యాపారాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక కుటుంబం, ఒక వ్యాపార వేత్త నినాదంతో వ్యాపార యూనిట్‌లకు బ్రోచర్‌ను రూపొందించారన్నారు. వ్యాపారం చేయడానికి ఆసిక్తి గలవారు దరఖాస్తు చేసుకుని మంచి ఆదాయ మార్గాన్ని ఇచ్చే వ్యాపారాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తారని తెలిపారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇన్‌చార్జి మెప్మా పీడీ జి.హెప్సిబా, జిల్లా లైవ్లీ హుడ్ స్పెషలిస్ట్ సీహెచ్ నానీబాబు, జిల్లా ఐబీ సీహెచ్ మోహనరావు ఉన్నారు.

పట్టణంలోని 38వార్డులో జేసీ పరిశీలన

పట్టణంలోని 38వ వార్డులో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతంలో పారిశుధ్యం, వార్డులో నీటి సరఫరా పరిశీలించారు. ప్రతిరోజు ఉదయాన్నే ఇంటింటికి వచ్చి మునిసిపల్ సిబ్బంది చెత్త సేకరణ చేస్తున్నారా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నీరు నిలిచిపోకుండా చర్యలు, డ్రెయినేజీలో చెత్త అడ్డు తొలగించాలని అధికారులకు సూచించారు. వార్డులో గ్రంథాలయం నిర్మాణానికి స్థలం పరిశీలించారు. ఏ శాఖకు సంబంధించిన స్థలమో తెలియజేయాలని మునిసిపల్ అధికారులను జేసీ ఆదేశించారు. జేసీ వెంట మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఎ.రాంబాబు, లక్ష్మి, మునిసిపల్ ఇంజనీర్ త్రినాథరావు, టీపీవో పార్థ సారథి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతో చేతివృత్తులు కనుమరుగు


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

భీమవరంటౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యం, కార్పొరేట్ మాయాజాలంతో సాంప్రదాయ చేతి వృత్తులు కనుమరుగవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు అన్నారు. చేతి వృత్తులను బతికించుకోవాలని, చేతి వృత్తిదారులు సంఘటితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. చేతివృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లుల శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా సదస్సు నిర్వహించారు. మోదీ చేపట్టిన విశ్వకర్మ, నాడు జగన్, నేడు చంద్రబాబు నాయుడు నెలకొల్పిన కులవృత్తుల కార్పొరేషన్లు చేతివృత్తుల సాధికారతకు ఊతం ఇవ్వలేదని, అవి ప్రచార కార్యక్రమాలని ఎద్దేవా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కుల వృత్తులను కార్పొరేట్ బాబులు కులవృత్తులుగా మార్చేసి వారికి ఉపాధి లేకుండా చేశారని చేతివృత్తిదారులు మనుగడ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎం.సీతారాంప్రసాద్, సికిలే పుష్పకుమారి, జేగురు శ్రీనివాస్, పీసీ.జోషి, అరట్లకట్ల నాగేశ్వరరావు, తిరుమాని కామేశ్వరరావు, కోన గొల్లయ్య, నారాయణ, వీరవల్లి శ్రీను, జుత్తుగ మీరయ్య, గూడూరి సత్యనారాయణ, చెల్లబోయిన చంద్రరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం డివిజన్‌లో
శరవేగంగా రీసర్వే

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతాడేపల్లి, ఇరగవరం మండలం జి..కండ్రిక, పెంటపాడు మండలం బి.కొండేపాడు గ్రావల్లోల భూముల రీసర్వే శరవేగంగా సాగుతోంది. డివిజినల్ ఇన్‌చార్జ్ డిప్యూటి ఇన్‌స్పెక్టర్ రౌతు రామకృష్ణ మంగళవారం రీసర్వే పరిశీలించారు. భూముల వివరాలు నమోదు చేయడానికి, కొత్త ఎల్‌పీ నెంబర్లు ఇవ్వడానికి అడంగల్ పేర్లు మార్చడానికి సర్వే బృందాలు పరిశీలనకు వస్తున్నారని, రైతులు ఈ సహకరించాలని కోరారు. రైతులకు నోటీసులు రాకపోతే సచివాలయంలో సర్వేయరు, గ్రామ రెవెన్యూ అధికారులకు తెలపాలని కోరారు.

కలిగొట్లలో భారీ వర్షం
బీసీ కాలనీ జలమయం

ఉండి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉండి మండలం కలిగొట్లలోని బీసీ కాలనీ మునిగిపోయింది. సమస్యను పలువరు డిప్యూటి స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో వర్షం నీరు తొలగింపు పనులు చేయించారు.

కొత్త ఉపాధ్యాయులకు యూటీఎఫ్ అభినందన


ఉపాధ్యాయులకు డైరీలు అందిస్తున్న యూటీఎఫ్ నేతలు

కాళ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విధులలో చేరిన నూతన ఉపాధ్యాయులకు యూటీఎఫ్ నాయకులు మంగళవారం అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విధుల్లో చేరిన 30 మంది ఉపాధ్యాయులకు యూటీఎఫ్ డైరీ, సీఎల్ బుక్ తదితర సామగ్రి అందించారు. విద్యారంగాన్ని పరిరక్షించునేందుకు యూటీఎఫ్ పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు. సీహెచ్.పట్టాభిరామయ్య, జి.రామకృష్ణంరాజు, బీఆర్ఎం కోటేశ్వరస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో సరస్వతి

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పోషకాహారం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీఎస్ పీవో టీఎల్ సరస్వతి అన్నారు. జగన్నాథపురంలో సంపూర్ణ పోషక ఆహారంపై గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంప్రదాయ వంటల తయారీ, శరీరానికి సంపూర్ణ పోషణ తదితర అంశాలు ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి, ఆరోగ్య కార్యకర్త ఎం.శాంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి వైద్యుల రాక

పెంటపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 16న గురువారం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్టు ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్లు, చర్మవ్యాధులు, జనరల్ సర్జన్, ఊపిరితిత్తులు సంబందించిన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు ఈసీజీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంధి అభిమానుల సేవా కార్యక్రమాలు

భీమవరం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా అయన అభిమానులు మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తాడేరు రోడ్‌లోని జడ్డు బ్రహ్మాజీ సూర్యకాంతం వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అన్నపూర్ణమ్మ అన్నదాన సేవ ట్రస్ట్ సభ్యులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 20 మందికి పైగా ఆనంద బ్లడ్ బ్యాంకుకు రక్తదానం చేశారు. గ్రంధి రవితేజ మాట్లాడుతూ తన తండ్రి గ్రంధి శ్రీనివాస్ పదవి ఉన్న లేకపోయినా ప్రజలకు సేవలో ఉంటారన్నారు. వెదురుపర్తి అరుణ్ కుమార్, చలపాక కృష్ణ భవాని, తోట బోగయ్య, కోటిపల్లి బాబు, నల్లం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



స్టాంపులను తిలకిస్తున్న విద్యార్థులు

స్టాంపులు, నాణేల సేకరణతో పరిజ్ఞానం

భీమవరంటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్టాంపులు, నాణేలు సేకరించడం విద్యార్థి దశ నుంచే అలవర్చుకుంటే పరిజ్ఞానం పెరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. భీమవరం పోస్టల్ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాల శాఖ వారోత్సవాల్లో భాగంగా స్టాంపులు, నాణాల ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. బ్రిటిష్ కాలంలోనే తొలి తపాల స్టాంప్ విడుదలైందని, అన్ని దేశాల్లో అయా దేశాల్లో ప్రముఖుల పేరిట స్టాంపులు ముద్రించి విడుదల చేసి వారి గౌరవాలను భావితరాలకు తెలియజేసేలా ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. హెడ్ పోస్టుమాస్టర్ పి.రాజు మాట్లాడుతూ తపాల శాఖ కేవలం ఉత్తరాలతోనే కాకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దేశ విదేశ 340 స్టాంపులు ప్రదర్శనలో ఏర్పాటు చేశామని, వివిధ పాఠశాలలోని విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారని తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ యూనియన్ లీడర్ లెనిన్ బాబు, పి.భాస్కర రాజు, శ్రీనివాస్ రాజు, నందమూరి రాజేష్, ఎండి సరోజినీ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, సివి రామన్, బార్డోలి స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

18న పీఎంపీల సంఘం ఉమ్మడి జిల్లా మహాసభ

గణపవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పీఎంపీ, ఆర్ఎంపీల జేఏసీ ఉమ్మడి జిల్లా మహాసభ ఈ నెల 18న తాడేపల్లిగూడెంలో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు ఏఆర్కే పరమేశ్వర్లు, ఎం.సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మరాజుకు ఆహ్వాన పత్రికను అందించారు. మహాసభలో పాల్గొవాలని కోరినట్లు తెలిపారు.

గ్రామాల్లో లభించే ఆకు కూరల్లోనే పోషకాలు

తణుకు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో లభించే ఆకు కూరలు, కూరగాయలతో పోషకారం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీవీకేఎస్ కృష్ణకుమారి చెప్పారు. తణుకు రూరల్ మండలం మండపాకలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పోషణ్ మహోత్సవంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. బాలికలు, చిన్నారులకు ఆకు కూరలతో ఆహారం అందించడం ద్వారా వారిలో రక్త హీనత నివారించవచ్చన్నారు. మునగ ఆకుతో చేసే వివిధ రకాల వంటకాలను మహిళలకు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్.వెంకటలక్ష్మి, శ్రీదేవి, విజయ, కనక మహాలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, అయాలు బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

తణుకు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 19వవార్డులోని ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని జీడిగుంట వారి వీధిలో ఆరవ సూర్య ఉదయ భాస్కర రావు ఇంట్లో రాయితీ గ్యాస్ సిలిండర్లు నిల్వఉంచారనే సమారంతో రెవెన్యూ సివిల్ సప్లై, ఫైర్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. 33 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సీఎస్ డీటీ శ్రీదేవి, అగ్నిమాపకాధికారి అజయ్‌కుమార్, పట్టణ ఏఎస్ఐ సత్యనారాయన తదితరులు పాల్గొన్నారు.

మారుతీ ప్రిన్సిపాల్‌కు పీహెచ్‌డీ ప్రదానం



తణుకు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తణుకు మారుతీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నామన కనకయ్యకు గణిత శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ చేసినట్లు మంగళవారం తెలిపారు. నంబూరి శ్రీధర్ పర్యవేక్షణలో పరిశోధనకు విశాఖపట్టణం గీతం యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు తెలిపారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వ కాలేజీలో మెహంది, క్రీడా పోటీలు

గణపవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రంగోలి, మెహంది, రన్నింగ్, ఆటల పోటీలు మంగళవారం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం ప్రథమ సంవత్సర విద్యార్థుల కోసం దీక్షారంభ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు రన్నింగ్, రంగోలి, మెహంది పోటీలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, అధ్యాపకులు వెంకటరమణ, గణేశ్‌కుమార్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగిఉండాలి

తణుకు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సీపీఆర్ పద్ధతులపై అవగాహన ఉండాలని రెడ్‌క్రాస్ ట్రైనర్ ధర్మ అన్నారు. ఎస్వీఎం డిగ్రీ కళాశాలలో సీపీఆర్ అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్‌తో అనేక ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి విద్యార్థి ప్రథమ చికిత్స నైపుణ్యాలు నేర్చుకోవాలన్నారు. అత్యవసర సమయంలో వెంటనే 108కు ఫోన్ చేయడం, బాధితుని సరిగా పడుకోబెట్టి చాతిపై 30 పీడనలు ఇవ్వడం, రక్షణ శ్వాసలు ఇవ్వడం, అంబులెన్సు వచ్చే వరకు ప్రక్రియ కొనసాగింపు చేయాలని వివరించారు. ప్రిన్సిపాల్ సీహెచ్.ఏడుకొండలు, రెడ్‌క్రాస్ కన్వీనర్ నాగభూషణ రెడ్డి, సూర్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సంఘ కార్యాలయంలో రెడ్ క్రాస్ సొసైటీ ఇన్‌చార్జి పెండ్యాల సూర్య ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. వైద్యులు బొల్లినేని కృష్ణ, అల్లూరి కరుణాకర్ చౌదరి, ఎం.డి స్వాలిహా, ఆర్జి భాస్కరరావు, కోడూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థులు

తాడేపల్లిగూడెం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.నాగవేణి మంగళవారం తెలిపారు. జిల్లా అండర్ 19 విభాగంలో క్రికెట్ పోటీల్లో వై.సుబ్రహ్మణ్యం, జె.మహేష్‌రెడ్డి, ఎం రోహిత్, ప్రత్యేక ప్లేయర్‌గా అంజిబాబు ఎంపికయ్యారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థులు, శిక్షకుడు మాణిక్యం రాజును కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

నన్నయ్య క్యాంపస్ కెమిస్ట్రీ ఫ్యాకల్టీకి అవార్డు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్ కెమిస్ట్రీ ఫ్యాకల్టీలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ ఎస్.ప్రశాంతికి కెమిస్ట్రీలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించినట్టు ప్రిన్సిపాల్ టి.అశోక్ తెలిపారు. విజయవాడలో సొసైటి ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ నుంచి ఈ అవార్డులు అందుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న అధ్యాపకులను అభినందించారు.

డీఆర్‌జీలో ఎన్‌సీసీ ఎంపికలు

పెంటపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహించారు. 19 ఆంధ్ర బెటాలియన్ సిబ్బంది సమక్షంలో ఎంపికలు జరిపారు. విద్యార్థులకు రన్నింగ్, రాత పరీక్షలు నిర్వహించారు. మొత్తం 64 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ అధికారి ప్రేమ్‌సాగర్ తెలిపారు.

ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్‌కు మార్గం సుగమం

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే విద్యుత్ రాయితీతో పాటు ఇతర ప్రయోజనాలు వర్తిస్తాయి. ఆక్వా ఉత్పత్తులు విక్రయించడానికి ముందు రిజిస్ట్రేషన్ అవసరం. ఇతర దేశాలకు ఎగుమతి చేయాలన్నా సరే, రైతులకు మంచి ధరలు రావాలన్నా సాగు పారదర్శకంగా ఉండాలి. రిజిస్ట్రేషన్ వల్లే అది సాధ్యం. మున్ముందు రొయ్య, చేప పిల్లల అమ్మకం నుంచి, మందుల విక్రయం వరకు చెరువుల రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరి. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. నాణ్యమైన పిల్ల, మందులు, మేతలు అందే అవకాశం ఉంటుంది. ఇన్ని ప్రయోజనాలు వున్నా సరే రైతులు రిజిస్ట్రేషన్‌కు ఇంత వరకు ముందుకు రాలేదు. ఇప్పుడిప్పుడే రైతుల్లోనూ చైతన్యం పెరిగి ముందుకు వస్తున్నారు.

వెలుగుచూస్తున్న అక్రమాలు

మెప్మా.. చెప్మా?



- పట్టించుకోని అధికారులు
- విచారణల్లోనూ సర్దుబాటు
- ఆర్‌పీలపై ఎమ్మెల్యే సిఫారసు బేఖాతర్
- రికవరీలపై దృష్టిసారించని వైనం

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : భీమవరం నాలుగో వార్డులో మెప్మా ప్రతినిధులు ఒక మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. అందులో పది మంది సభ్యులు ఉండాలి. ఐదుగురి వివరాలను సక్రమంగా సమర్పించారు. మరో ఐదుగురు పేర్లు వేర్వేరైనా సరే ఫొటో మాత్రం ఒక్కరిదే. దానిని పరిశీలిం చకుండా మెప్మా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి బ్యాంకుకు పంపించారు. తీరా బ్యాంకులో రుణం రాలేదు. సభ్యులు నిలదీస్తే అసలు విషయం బయటపడింది. సదరు సంఘానికి ఆర్‌పీ తప్పిదం వల్లే రుణం నిలిచిపోయిందంటూ ఇప్పుడంతా చర్చించుకుంటున్నారు. రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ)ని తొలగించాలంటూ ఎమ్మెల్యే అంజిబాబు అధికారులకు లేఖ రాశారు. అయినా నిబంధనలు ఒప్పుకోవంటూ లేఖను పక్కన పెట్టారు. కొందరు మెప్మా ప్రతినిధులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. గడిచిన ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. అప్పట్లో వలంటీర్‌గా వ్యవహరించిన ఆర్‌పీని తొలగించాలంటూ ఎమ్మెల్యే అంజిబాబు లేఖ రాస్తే నిబంధనలంటూ కాలయాపన చేస్తున్నారు. సక్రమంగా సంఘాలను నిర్వహించడంలో విఫలమవు తున్న ఆర్‌పీలను తొలగించాలంటూ కూటమి నాయకులు బలంగా డిమాండ్ చేస్తున్నారు. వీరివల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని మదనపడుతున్నారు. పలువురు ఆర్‌పీల భాగోతాలు మెప్మాలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

- మహిళా సభ్యులకు తెలియకుండా సొంత గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలు తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. తక్కువ వడ్డీలకు రుణాలు పొందుతూ కొందరు ఆర్‌పీలు దర్జా ఒలకబోస్తున్నారు. తాడేరులో ఏకంగా రూ.20 లక్షలు అవతవకలు జరిగినట్టు అంతా గప్పుమంది. దీనిపై మహిళా సంఘాల్లో చర్చ సాగుతోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చినఅమిరం పంచాయతీలో ముగ్గురు ఆర్‌పీలను తొలగించారు. వారి స్థానంలో మరో ముగ్గురు కొత్త ఆర్‌పీలను నియమించారు. మహిళా సంఘాలు తీర్మానం చేసుకుని కొత్తవారిని నియమించుకున్నారు. వారికి బాధ్యతలు అప్పగించడానికి మెప్మా అధికారులు తిప్పలు పెట్టారు. నాలుగు నెలల తర్వాత బాధ్యతలు అప్పగించారు. వైసీపీ హయాంలో పట్టణాల్లో పరిసర గ్రామాలను విలీనం చేయడంతో అక్కడ మహిళా సంఘాలు మెప్మా పరిధిలోకి వచ్చాయి. పంచాయతీల్లో సభ్యులు మెప్మా ఆధీనంలోనే రుణాలు పొందుతున్నారు.

వాస్తవానికి వైసీపీ ప్రభుత్వంలో అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు చెప్పినదానికి మెప్మా సిబ్బంది తలూపారు. భీమవరంలో ఒకేసారి 23 మంది ఆర్‌పీలను తొలగించారు. వైసీపీకి అనుకూలమైన వారిని ఆర్‌పీలుగా నియమించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే వారంతా గడిచిన ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. స్వామి భక్తిని ప్రదర్శించారు. అయినా మహిళలు వారి మాటలను పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి నేతలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ మహిళా సంఘాలను తమ చెప్పు చేతల్లో ఉంచుకునేలా కొందరు ఆర్‌పీల తీరు మెప్మాను అభాసుపాలు చేస్తోంది. జిల్లా అధికారులు విమర్శలను ఎదుర్కొంటున్నారు.

ప్రజాప్రతినిధుల సిఫారసులను బేఖాతరు చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారంటూ మహిళా సంఘాలు గగ్గోలు పెడుతున్నా సరే అధికారులు పెడచెవిన పెడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో అవతవకలు ఉన్నట్టు తేలిన నిధులకు సంబంధించి మెప్మా సుమారు కోటి రూపాయలకు పైగానే రికవరీ చేయాలి.

బంధువులే సభ్యులు

భీమవరంలో కొందరు ఆర్‌పీలు తమ సొంత బంధువులను సభ్యులుగా చేర్చి రుణాలు పొందుతున్నారు. సొంతానికి వాడుకుంటున్నారు.

ఈవిధంగా నిధులు దుర్వినియోగం అయినట్టు తేలితే తూతూ మంత్రపు విచారణతో అధికారు లు సరిపెడుతున్నారు. వైసీపీ హయాంలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం పట్ట ణాల పరిధిలో అవతవకలు వెలుగు చూశాయి. తాడేపల్లిగూడెంలో వైసీపీ నేత అనుచరురాలికి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించారు. అప్పట్లో ఆమెదే మున్సిపాలిటీలో అంతా అధికారం. తమ మాట వినని ఆర్‌పీలను వేధించడంలో ఎక్కడా వెనుకాడ లేదు. అప్పటివరకు సక్రమంగా పనిచేసిన ఆర్‌పీలను తాడేపల్లిగూడెంలోనూ తొలగించేశారు. విధులు నిర్వహించకుండా పక్కన పెట్టేశారు. కొత్తవారితో బాధ్యతలు నిర్వహించారు. మహిళా సంఘాల నుంచి సొమ్ములు వసూలు చేసి పబ్బం గడిపేసుకున్నారు. మెప్మాలో ఆ వాసనలు ఇంకా పోలేదు. అవతవకలు జరుగుతున్నాసరే మెప్మా పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలు జరిగినట్టు తేలినా సరే రికవరీలు చేయడం లేదు.

బ్యాంకులకు వెళ్లని మహిళలు

రుణాలు తీసుకున్న కొంతమంది మహిళలు బ్యాంకులకు వెళ్లడం లేదు. ఇప్పటికీ ఆర్‌పీలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. బ్యాంకుల వద్దకు ఆర్‌పీలు వెళ్లి మహిళా సంఘాల సొమ్ములు చెల్లిస్తున్న సందర్భాలుంటున్నాయి. రికార్డులు ఎలా నిర్వహిస్తున్నారనే విషయంపై మహిళా సంఘాల సభ్యులు అడిగే సాహసం చేయలేక పోతున్నారు. ప్రతి రెండేళ్లకు మహిళా సంఘాల సభలను ఏర్పాటు చేయాలి. వారి అభిప్రాయాలను సేకరించాలి. ఆర్‌పీలపై విశ్వాసం లేకపోతే మహిళా సభ్యులు వారిని తొలగించే హక్కు ఉంటుంది. గడిచిన ఐదేళ్లుగా సమావేశాలు ఏర్పాటు చేయడం లేదు. మహిళా సభ్యులు ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతో సమావేశాలను దాటవేస్తున్నారు. దీర్ఘకాలంగా ఒకేచోట ఉద్యోగాలు చేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడే ఆర్‌పీలను వెనకేసుకొస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలనుంచి ఫిర్యాదులు వెళితే విచారణ చేపడుతున్నారు. అంతా సవ్యంగా ఉందంటూ సరిపెడుతున్నారు. అక్రమాలకు పాల్పడే ఆర్‌పీలకు వంత పాడుతూ వస్తున్నారు.









భీమవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు, టీడీపీ నేతల ప్రచారం, తణుకులో జీఎస్టీ సడలింపులపై ఇంటింటా ప్రచారం, గణపవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం

జీఎస్టీ తగ్గింపు ప్రజలకు మేలు

భీమవరంటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, సగటున మనిషికి రూ 3 వేలు ఆదా అవుతుందని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. భీమవరం కాస్మో పాలిటిన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ బెనిఫిట్ బజార్‌ను ఎమ్మెల్యే అంజిబాబు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. 5 రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, బజార్లో వివిధ వస్తువులను తగ్గింపుపై అమ్మకాలను చేపట్టడం జరుగుతుందన్నారు. దీపావళికి ముందు ఈ ఉత్సవం నిర్వహించడం ద్వారా పన్ను సంస్కరణలపై ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందన్నారు. భీమవరం సూపర్ జీఎస్టీ బెనిఫిట్ బజార్‌లో ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు, ఎంఎస్ఎంఈలు, హస్తకళలు, చేనేత, వస్త్రాలు, ఫ్యాషన్ వస్తువులు, గృహోపకరణాలు, పుస్తకాలు, స్టేషనరీ, వ్యవసాయ పరికరాలు, వ్యవసాయ యంత్రాలు, గృహాలంకరణ, ఫర్నిచర్, పర్యాటకం, ఆతిథ్య ప్రదర్శనలు, ఆటోమొబైల్, తదితర వస్తువులను మెగా డిస్కౌంట్ తో అమ్మకాలు జరుగుతాయన్నాయని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె రామచంద్రా రెడ్డి కోళ్ల నాగేశ్వరరావు, మెంటే పార్థసారధి, కోళ్ల రామచంద్రరావు, ఇందుకూరి రామలింగ రాజు, గంటా త్రిమూర్తులు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ప్రచారం

జీఎస్టీ తగ్గింపుతో పేద మధ్య తరగతి కుటుంబాలలో సంతోషం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి అన్నారు. పట్టణంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మద్దుల రాము మాట్లాడుతూ జీఎస్టీ పన్నుల తగ్గింపుతో పేద మధ్య తరగతి కుటుంబాలకు అధిక పన్నుల భారం తగ్గి వారికి కావలసిన వస్తువులు సరుకులు కొనుగోలు చేసుకుంటున్నారని తెలిపారు. చెల్లబోయిన గోవింద్, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, మాదాసు కనకదుర్గ, ఎండి షబీనా, మైబత్తుల ఐజాక్‌బాబు, గొలగాని రమేష్, సయ్యద్ నాసిమా బేగం, మాంతి గణపతి, యలమంచిలి శ్రీనివాస్ నేదునూరి గంగాధర్ సీహెచ్ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి మేలు

తణుకు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సడలింపులతో ప్రతి కుటుంబానికి రూ.15వేలు ఆదా అవుతుందని టీడీపీ ప్రచార కార్యదర్శి తాతపూడి మారుతీరావు అన్నారు. 20వ వార్డులో డ్వాక్రా సంఘాలు సభ్యులు, సచివాలయ సిబ్బందితో కలసి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ జీఎస్టీ తగ్గింపు వల్ల మేలును వివరించారు. కార్యక్రమంలో గమిని రాము, విత్తనాల సాయి, నాని తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

గణపవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం వద్ద సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై మంగళవారం ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన తరువాత ప్రజలకు ఎలాక్ట్రానిక్ గూడ్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ తదితర వస్తువులపై కొనుగోలు శక్తిపెరిగిందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి సరిపల్లె మీదుగా గణపవరం సెంటర్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపవరం, కాశీపాడు సొసైటీ చైర్‌పర్సన్‌లు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కొలనువాడ శ్రీనివాసరాజు, గణపవరం మండల తెలుగుయువత అధ్యక్షుడు కాపారం చిన్న, టీడీపీ సీనియర్ నాయకుడు సరిపల్లె సూరపరాజు, మండల గ్రామ కార్యదర్శులు సంఘం నాయకులు శివరామ్‌ప్రసాద్, రామాంజనేయులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



ఉచితంగా మందులు అందిస్తున్న నేతలు

మసీదు సెంటర్‌లో వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద మసీదు వద్ద అంబేడ్కర్ కమ్యూనిటి హాలులో పీఎంపీ వెల్ఫేర్ అసోషియేషన్, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రం హాస్పటల్, విజయవాడ ఆంధ్ర హాస్పటల్, తణుకు లలితా గ్యాస్ట్రో లివర్ క్లినిక్ వైద్యులు 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. పీఎంపీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు షేక్ బాజి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, పెద్ద మసీదు ఉపాధ్యక్షుడు ఎస్‌కే.సంసుద్దిన్, ఎస్సీ సెల్ కార్యదర్శి వై.స్వరాజ్ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఆరుగొలనులో 360 మందికి ఉచిత వైద్యపరీక్షలు

మానవత స్వచ్ఛంద సంస్థ, ఆరుగొలను సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సహకారంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సొసైటి అధ్యక్షుడు ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. 360 మందికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఏలూరు ఆశ్రం వైద్యులు మెడిసిన్, అర్థోపెడిక్, ఆప్తమాలజీ, పిడియాట్రిక్, డెర్మటాలజీ తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మానవత అధ్యక్షుడు డి.రాజేంద్ర ప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కేవి రామారావు, యూవీవీ యువసేన, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్..

తణుకు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత బీపీ, షుగర్ పరీక్షలను డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు నిర్వహించారు. 35 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, అడ్డాల సత్యనారాయణ, ద్వారంపూడి బాపిరెడ్డి, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

18న మెగా వైద్య శిబిరం

ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో ఈనెల 18న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మంగళవారం తెలిపారు. శిబిరాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభిస్తారని చెప్పారు. ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు వేణు, 8886411888, మోహన్ 9701602954కు సంప్రదించాలని కోరారు.

క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

గణపవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో క్షయవ్యాధి నివారణపై డాక్టర్ దీరజ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోగులకు చికిత్స, మందుల సరఫరా తదితర అంశాల పై శిక్షణ ఇచ్చారు. క్షయరోగుల గుర్తింపు, చికిత్స నియమాలపై అవగాహన కల్పించేందుకు సూచనలు చేశారు. డాక్టర్ సీహెచ్.ధనలక్ష్మి, ఎంపీహెచ్‌వో జలాది విల్సన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థిని అదృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న హాస్టల్ విద్యార్థిని అదృశ్యమైనట్టు రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసునమోదయింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా టి నరసాపురం మండలం కేతవరం గ్రామానికి చెందిన ఎస్.జ్యోతి స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ రెండో సంవత్సరం చదువుతోంది. ఈనెల 13న ఉదయం హాస్టల్ నుంచి కళాశాలకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు చేరలేదు. ఆమె తండ్రి లక్ష్మణరావుకు సమాచారం ఇచ్చి ఆచూకీ లేకపోవడంతో ప్రిన్సిపాల్ జి.రత్నాకరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ జిలాని తెలిపారు.

అదృశ్యమైన బాలికను అప్పగించిన పోలీసులు

మొగల్తూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పరిధిలోని నాగదేవత కాలనీలో బాలిక అదృశ్యం కేసును కొన్ని గంటల్లోనే పోలీసులు ఛేదించారు. నరసాపురం డీఎస్పీ శ్రీవేద ఆధ్వర్యంలో సీఐ దుర్గాప్రసాద్ మూడు బృందాలు ఏర్పాటుచేసి బాలిక అచూకీ కనుగొన్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు అదృశ్యమైన బాలికను మంగళవారం ఆమె తల్లిదండ్రులకు పోలీసులు స్టేషన్ వద్ద అప్పగించినట్టు స్టేషన్ సిబ్బంది తెలిపారు.

మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు ఫ్యాన్లు విరాళం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వీవర్స్ కాలనీలోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు తిల్లపూడికి చెందిన పారిశ్రామికవేత్త కామిశెట్టి అయ్యప్ప నాయుడు ఒక పెడస్టల్ ఫ్యాన్, 4 సీలింగ్ ఫ్యాన్లు మంగళవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న అయ్యప్ప నాయుడిని పాఠశాల హెచ్ఎం భవానీ ప్రసాద్ అభినందించారు. ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, మధుసూదన రెడ్డి, లీలా కుమారి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

ఆచంట, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): కౌలు రైతులకు అన్న దాత సుఖీభవ పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉందుర్తి శ్రీనివాసు, మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. భూయజమానుల సంతకంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలని, ప్రతీ కౌలు రైతులకు రూ.2 లక్షల పంట రుణం ఇవ్వాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కనకరాజుకు వినతిపత్రం అందించారు. కేతా పూర్ణారావు, కొండేటి సత్యనారాయణ, పుచ్చకాయల నాగరాజు, పి.మోహన్ పాల్గొన్నారు.

టెండర్లు తెరిచేందుకు సర్పంచ్ నిరాకరణ

ఉన్నతాధికారులకు ఈవీపీఆర్డీ నివేదిక

నరసాపురం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం పంచాయతీలో తాత్కాలిక సిబ్బంది నియామకానికి టెండరు తెరిచేందుకు సర్పంచ్ నిరాకరించారు. సర్పంచ్ సంది సుజాత ఆధ్యక్షతన మంగళవారం జరిగిన అత్యవసర సమావేశానికి ఈవోపీఆర్డీ నాగేంద్రకుమార్, పాలక మండలి సభ్యులు హాజరయ్యారు. పంచాయతీలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది పాటు పని చేసేందుకు పాట్ మిత్ర, గ్రీన్ అంబాసిడర్, పంపు ఆపరేటర్ సంబంధించి టెండర్లను అహ్వానించారు. ఈ పోస్టులకు ఏడుగురు టెండర్లు దాఖలు చేశారు. టెండర్లను తెరిచేందుకు సర్పంచ్ నిరాకరించారు. దీంతో టెండర్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. సమావేశంలో జరిగిన పరిణామాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈవోపీఆర్డీ నాగేంద్రకుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పి.శేషు, ఎంపీటీసీ మేరిరత్నం, కార్యదర్శి కళ్యాణి, సభ్యులు పాల్గొన్నారు.

మల్లవరం సర్పంచ్‌కు షోకాజ్ నోటీస్

నరసాపురం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పంచాయితీ నిధుల దుర్వియోగంపై మండలంలోని మల్లవరం సర్పంచి సంది సుజాతకు పంచాయితీ రాజ్ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఉప సర్పంచ్ పుల ఖండం శేషు, పాలకవర్గ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఏడాది మే 4న డీఎల్‌పీవో జ్యోతిర్మయి పంచాయితీ కార్యాలయంలో విచారణ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు రికార్డులు పరిశీలించగా రూ 31,82,334 మేర నిధులు నిబంధనలను దారిమళ్లీనట్లు గుర్తించారు. నిధుల దుర్వినియోగంలో కార్యదర్శులపై తగు చర్యలు తీసుకోవాలని డీఎల్పీవోకు సిఫారసు చేశారు. సర్పంచ్ పంచాయతీ పాలనలో నిబంధలను అతిక్రమించి, పెద్ద మొత్తంలో సర్పంచ్ భర్త నర్సింహారావు నిధులు మళ్లింపు చేసినందుకు గాను పంచాయతీరాజ్ చట్టంను సారంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా పంచాయతీ సర్పంచ్‌కి షోకాజ్ నోటీస్ జారీ చేసింది.

నరసాపురంలో శ్రేయస్సు ర్యాలీ

నరసాపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిషన్ హైస్కూల్ రోడ్‌లో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శారీరక ఆరోగ్యంలా మానసిక ఆరోగ్యానికి ఒకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈ శ్రీరాం సురేష్, డాక్టర్ సత్యనారాయణ, బాబూరావు, డి చిట్టిబాబు, ప్రిన్సిపాల్ సరళ అశీర్వాదం, జేసుప్రసాద్, రంగినీడి సుబ్బారావులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై వైసీపీ నిరసన

ఆచంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యంపై మంగళవారం వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముదునూరి మురళీకృష్ణం రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెరుకువాడ శ్రీరంగనాథ రాజు పాల్గొన్నారు. అనంతరం తూర్పుపాలెం లోని వైసీపీ కార్యాల యం వద్ద సమావేశం నిర్వహించారు. 4 మండలాల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న విప్ నాయకర్, పొత్తూరి, కొల్లు పెద్దిరాజు, ఆర్డీవో తదితరులు

అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గింపు

నరసాపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల పేద వర్గాలకు మరింత మేలు జరిగిందని విప్ నాయకర్ అన్నారు. పట్టణంలోని 13వార్డులో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి ఛైర్మన్ కొల్లు పెద్దిరాజుతో కలిసి మంగళవారం జీఎస్టీపై అవగాహన కల్పించారు. సిమెంట్‌పై 28 నుంచి 18శాతం, మార్బుల్, గ్రానైట్ బ్లాక్స్‌లపై 12 నుంచి 5శాతం తగ్గించడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇంటి నిర్మాణ ఖర్చు తగ్గిందన్నారు. ఎలక్ట్రికల్ వస్తువులపై కూడా జీఎస్టీ మరింతగా తగ్గించిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, కమిషనర్ అంజయ్య, ఎంపీడీవో వీరభద్రరావు, తహసీల్దార్ ఐవీవీ.సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులతో మాట్లాడుతున్న కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు

కిల్కారి కాల్స్‌తో గర్భిణులకు వైద్య సేవలు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):గర్భిణులు కిల్కారి కాల్స్ ద్వారా ఆరోగ్య సేవలు పొందవచ్చునని జిల్లా కిల్కారి (చిన్నారి చిరునవ్వులు) ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు తెలిపారు. లంకల కోడేరు పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం దగ్గులూరు సచివాలయం వద్ద గర్భిణులతో మాట్లాడారు. కిల్కారి అంటే చిరునవ్వు అని కిల్కారి కాల్స్ గర్భిణులు 4వ మాసం నుంచి బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకూ ఈసేవలు పొందవచ్చునని తెలిపారు. దీని ద్వారా ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై పలు సూచనలు, సలహాలు లభిస్తాయన్నారు. గర్భిణులు ఈసేవలు పొందలంటే 9116001036660కు ఫోన్ చేయవచ్చునని రాజు తెలిపారు. మాతా, శిశు మరణాలు తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం కిల్కారి సేవలను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, ఎంపిహెచ్ఎస్ ఎస్‌కే అమలేశ్వరరావు, సిబ్బంది దివాకర్ బాబు, లిఖిత, సుజ్ఞానమణి, ఆశాలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

మొగల్తూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణపై మూడు మండలాల గ్రామ పంచాయతీ క్లస్టర్ సీఆర్‌పిలకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. రామన్నపాలెం సంపద కేంద్రం వద్ద నిర్వహించిన శిక్షణలో డీఎల్‌పీవో జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. మొగల్తూరు, నరసాపురం, యలమంచిలి మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ క్లస్టర్ సీఆర్‌పిలు సిబ్బంది పాల్గొన్నారు. డీపీఆర్‌సీ అడ్వర్డు, మూడు మండలాల డిప్యూటీ ఎంపీడీవోలు పలు సూచనలు చేశారు.

వడలిలో సీఆర్‌పీలకు శిక్షణ

పెనుగొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారి కేంద్రంగా అభివృద్ధి హరిత రాయబారుల కృషేనని సర్పంచ్ కాసాని విజయ లక్ష్మి అన్నారు. వడలిలో ఎస్‌డబ్ల్యూపీసీ లోకల్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నియోజకవర్గ పరిధిలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల సీఆర్‌పీలకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల కార్యదర్శి ఉప్పలపాటి చంటి మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామం అవ్వాలంటే ప్రతీ ఇంటి నుండి వచ్చే వ్యర్థాలను తడిపొడి చెత్తగా వేరు చేసి వాటిని మన ఇంటి వద్దకు వచ్చే హరిత రాయబారికి అందజేయాలన్నారు. కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారి కేంద్రం జిల్లాలోనే ఎల్‌టీసీ కేంద్రం గా అభివృద్ధి చెందడానికి సర్పంచ్, కార్యవర్గ సభ్యులు సహకారం ఎంతో అవసరం అన్నారు. డీపీఆర్‌సీ సిబ్బంది కె.విశ్వనాథ్, సీహెచ్ పార్థసారధి, లలిత తదితరులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



ముత్యాలపల్లి జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

జాతీయ రహదారికి అనుసంధానం చేయాలి

మొగల్తూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి పంచాయతీ పరిధి గెదళ్లవంపు రహదారిని జాతీయ రహదారికి అనుసందానం చేయాలని మంగళవారం ఆందోళన నిర్వహించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి మలుపు తిరిగి తమ గ్రామానికి వెళ్లాల్సి ఉందని జాతీయ రహదారి ఎత్తుగా ఉండడంతో తమ గ్రామ రహదారికి అప్రోచ్ లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామ రహదారిని జాతీయ రహదారితో అనుసందానం చేస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఆందోళనలో నాగిడి రాంబాబు, దొంగ శ్రీను, కవురు రమేష్, మామిడిశెట్టి నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుకు గ్లాసులు, కంచాలు అందజేత

పెనుమంట్ర, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు భోజనం చేసేందుకు కంచాలు గ్లాసులు విద్యార్థులకు అందజేశారు. పెనుమంట్ర మోడల్ స్కూల్‌లో 60 కంచాలు 60 గ్లాసులు జవ్వాది నాగేశ్వరరావు తల్లి జవ్వాది ధనలక్ష్మీ జ్ఞాపకర్థం మంగళవారం పంపిణీ చేశారు. ఎంఈవో ఉంగరాల నాగేశ్వరరావు, దేవస్థానం ఛైర్మన్ యర్రా రాధే గోపాల్, హెచ్‌ఎం మహంకాళి, ఆకెళ్ళ వెంకట సూర్య కృష్ణ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బంకులో విజిలెన్స్ విచారణ

ఏలూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏలూరు బస్టాండ్ పెట్రోల్ బంకులో ఇటీవల బిల్లుల గోల్‌మాల్ చేసి రూ.78 లక్షల పైబడి సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారు. విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు చేసి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. మరోవైపు విజయవాడ నుంచి చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ శివరామ్ కూడా తనిఖీలు చేపట్టారు. ఐదేళ్ల క్రితం నుంచి ఈ బంకులో పేటీఎం, గూగూల్ పే, ఇతరత్రా బిల్లుల జమ విషయంలో డిపో క్లర్క్, 10 మందికి పైగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది మాయాజాలం ప్రదర్శించి లక్షల్లో జమ కావాల్సిన సొమ్మును కాజేశారు. గత తొమ్మిది నెలలు వివరాలను 15 రోజులు అధికారులు పరిశీలిస్తే 78 లక్షలు గోల్‌మాల్ జరిగినట్టు తేలింది.

ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్‌కు మార్గం సుగమం

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే విద్యుత్ రాయితీతో పాటు ఇతర ప్రయోజనాలు వర్తిస్తాయి. ఆక్వా ఉత్పత్తులు విక్రయించడానికి ముందు రిజిస్ట్రేషన్ అవసరం. ఇతర దేశాలకు ఎగుమతి చేయాలన్నా సరే, రైతులకు మంచి ధరలు రావాలన్నా సాగు పారదర్శకంగా ఉండాలి. రిజిస్ట్రేషన్ వల్లే అది సాధ్యం. మున్ముందు రొయ్య, చేప పిల్లల అమ్మకం నుంచి, మందుల విక్రయం వరకు చెరువుల రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరి. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. నాణ్యమైన పిల్ల, మందులు, మేతలు అందే అవకాశం ఉంటుంది. ఇన్ని ప్రయోజనాలు వున్నా సరే రైతులు రిజిస్ట్రేషన్‌కు ఇంత వరకు ముందుకు రాలేదు. ఇప్పుడిప్పుడే రైతుల్లోనూ చైతన్యం పెరిగి ముందుకు వస్తున్నారు.

వెలుగుచూస్తున్న అక్రమాలు

మెప్మా.. చెప్మా?

- పట్టించుకోని అధికారులు
- విచారణల్లోనూ సర్దుబాటు
- ఆర్‌పీలపై ఎమ్మెల్యే సిఫారసు బేఖాతర్
- రికవరీలపై దృష్టిసారించని వైనం



(భీమవరం-ఆంధ్రజ్యోతి) : భీమవరం నాలుగో వార్డులో మెప్మా ప్రతినిధులు ఒక మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. అందులో పది మంది సభ్యులు ఉండాలి. ఐదుగురి వివరాలను సక్రమంగా సమర్పించారు. మరో ఐదుగురు పేర్లు వేర్వేరైనా సరే ఫొటో మాత్రం ఒక్కరిదే. దానిని పరిశీలిం చకుండా మెప్మా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి బ్యాంకుకు పంపించారు. తీరా బ్యాంకులో రుణం రాలేదు. సభ్యులు నిలదీస్తే అసలు విషయం బయటపడింది. సదరు సంఘానికి ఆర్‌పీ తప్పిదం వల్లే రుణం నిలిచిపోయిందంటూ ఇప్పుడంతా చర్చించుకుంటున్నారు. రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ)ని తొలగించాలంటూ ఎమ్మెల్యే అంజిబాబు అధికారులకు లేఖ రాశారు. అయినా నిబంధనలు ఒప్పుకోవంటూ లేఖను పక్కన పెట్టారు. కొందరు మెప్మా ప్రతినిధులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. గడిచిన ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. అప్పట్లో వలంటీర్‌గా వ్యవహరించిన ఆర్‌పీని తొలగించాలంటూ ఎమ్మెల్యే అంజిబాబు లేఖ రాస్తే నిబంధనలంటూ కాలయాపన చేస్తున్నారు. సక్రమంగా సంఘాలను నిర్వహించడంలో విఫలమవు తున్న ఆర్‌పీలను తొలగించాలంటూ కూటమి నాయకులు బలంగా డిమాండ్ చేస్తున్నారు. వీరివల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని మదనపడుతున్నారు. పలువురు ఆర్‌పీల భాగోతాలు మెప్మాలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

- మహిళా సభ్యులకు తెలియకుండా సొంత గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలు తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. తక్కువ వడ్డీలకు రుణాలు పొందుతూ కొందరు ఆర్‌పీలు దర్జా ఒలకబోస్తున్నారు. తాడేరులో ఏకంగా రూ.20 లక్షలు అవతవకలు జరిగినట్టు అంతా గప్పుమంది. దీనిపై మహిళా సంఘాల్లో చర్చ సాగుతోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చినఅమిరం పంచాయతీలో ముగ్గురు ఆర్‌పీలను తొలగించారు. వారి స్థానంలో మరో ముగ్గురు కొత్త ఆర్‌పీలను నియమించారు. మహిళా సంఘాలు తీర్మానం చేసుకుని కొత్తవారిని నియమించుకున్నారు. వారికి బాధ్యతలు అప్పగించడానికి మెప్మా అధికారులు తిప్పలు పెట్టారు. నాలుగు నెలల తర్వాత బాధ్యతలు అప్పగించారు. వైసీపీ హయాంలో పట్టణాల్లో పరిసర గ్రామాలను విలీనం చేయడంతో అక్కడ మహిళా సంఘాలు మెప్మా పరిధిలోకి వచ్చాయి. పంచాయతీల్లో సభ్యులు మెప్మా ఆధీనంలోనే రుణాలు పొందుతున్నారు.

వాస్తవానికి వైసీపీ ప్రభుత్వంలో అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు చెప్పినదానికి మెప్మా సిబ్బంది తలూపారు. భీమవరంలో ఒకేసారి 23 మంది ఆర్‌పీలను తొలగించారు. వైసీపీకి అనుకూలమైన వారిని ఆర్‌పీలుగా నియమించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే వారంతా గడిచిన ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. స్వామి భక్తిని ప్రదర్శించారు. అయినా మహిళలు వారి మాటలను పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి నేతలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ మహిళా సంఘాలను తమ చెప్పు చేతల్లో ఉంచుకునేలా కొందరు ఆర్‌పీల తీరు మెప్మాను అభాసుపాలు చేస్తోంది. జిల్లా అధికారులు విమర్శలను ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధుల సిఫారసులను బేఖాతరు చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారంటూ మహిళా సంఘాలు గగ్గోలు పెడుతున్నా సరే అధికారులు పెడచెవిన పెడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో అవతవకలు ఉన్నట్టు తేలిన నిధులకు సంబంధించి మెప్మా సుమారు కోటి రూపాయలకు పైగానే రికవరీ చేయాలి.

బంధువులే సభ్యులు

భీమవరంలో కొందరు ఆర్‌పీలు తమ సొంత బంధువులను సభ్యులుగా చేర్చి రుణాలు పొందుతున్నారు. సొంతానికి వాడుకుంటున్నారు. ఈవిధంగా నిధులు దుర్వినియోగం అయినట్టు తేలితే తూతూ మంత్రపు విచారణతో అధికారు లు సరిపెడుతున్నారు. వైసీపీ హయాంలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం పట్ట ణాల పరిధిలో అవతవకలు వెలుగు చూశాయి. తాడేపల్లిగూడెంలో వైసీపీ నేత అనుచరురాలికి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించారు. అప్పట్లో ఆమెదే మున్సిపాలిటీలో అంతా అధికారం. తమ మాట వినని ఆర్‌పీలను వేధించడంలో ఎక్కడా వెనుకాడ లేదు. అప్పటివరకు సక్రమంగా పనిచేసిన ఆర్‌పీలను తాడేపల్లిగూడెంలోనూ తొలగించేశారు. విధులు నిర్వహించకుండా పక్కన పెట్టేశారు. కొత్తవారితో బాధ్యతలు నిర్వహించారు. మహిళా సంఘాల నుంచి సొమ్ములు వసూలు చేసి పబ్బం గడిపేసుకున్నారు. మెప్మాలో ఆ వాసనలు ఇంకా పోలేదు. అవతవకలు జరుగుతున్నాసరే మెప్మా పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలు జరిగినట్టు తేలినా సరే రికవరీలు చేయడం లేదు.

బ్యాంకులకు వెళ్లని మహిళలు

రుణాలు తీసుకున్న కొంతమంది మహిళలు బ్యాంకులకు వెళ్లడం లేదు. ఇప్పటికీ ఆర్‌పీలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. బ్యాంకుల వద్దకు ఆర్‌పీలు వెళ్లి మహిళా సంఘాల సొమ్ములు చెల్లిస్తున్న సందర్భాలుంటున్నాయి. రికార్డులు ఎలా నిర్వహిస్తున్నారనే విషయంపై మహిళా సంఘాల సభ్యులు అడిగే సాహసం చేయలేక పోతున్నారు. ప్రతి రెండేళ్లకు మహిళా సంఘాల సభలను ఏర్పాటు చేయాలి. వారి అభిప్రాయాలను సేకరించాలి. ఆర్‌పీలపై విశ్వాసం లేకపోతే మహిళా సభ్యులు వారిని తొలగించే హక్కు ఉంటుంది. గడిచిన ఐదేళ్లుగా సమావేశాలు ఏర్పాటు చేయడం లేదు. మహిళా సభ్యులు ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతో సమావేశాలను దాటవేస్తున్నారు. దీర్ఘకాలంగా ఒకేచోట ఉద్యోగాలు చేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడే ఆర్‌పీలను వెనకేసుకొస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలనుంచి ఫిర్యాదులు వెళితే విచారణ చేపడుతున్నారు. అంతా సవ్యంగా ఉందంటూ సరిపెడుతున్నారు. అక్రమాలకు పాల్పడే ఆర్‌పీలకు వంత పాడుతూ వస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి : పితాని

ఆచంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. వల్లూరు, భీమలాపురంలో పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే మరిన్ని హామీలు నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం, ప్రతీ ఇంటికి మూడు గ్యాస్‌బండలు ఇవ్వడంతోపాటు స్త్రీశక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. వల్లూరు, భీమలాపురంలో శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలని, డ్రెయినేజీ సౌకర్యం ఏర్పాటు చేయాలని, లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే పితాని దృష్టికి తీసుకువచ్చారు. వల్లూరులో త్వరలోనే శ్మశాన వాటిక అభివృద్ధిదో పాటు డ్రెయినేజీ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. భీమలాపురంలో కూడా సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో హౌసింగ్ పథకం నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వంలో అర్హులందరికి ఇల్లు నిర్మించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, భీమలాపురం సర్పంచ్ గుబ్బల మాధవరావు, చిలుకూరి సీతారామ్, జవ్వాది బాలాజీ, వైస్ ఎంపీపీలు తాళం శ్రీనివాస్, యర్రగొప్పుల నాగరాజు, దేవళ్ల రమేష్, తమ్మినీడి ప్రసాద్, ఏడిద శ్రీనివాసు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పిచ్చియ్య, ఎంపీడీవో బి.కృష్ణమోహన్, తహసీల్దార్ జి.కనకరాజు పాల్గొన్నారు.



వల్లూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

పీహెచ్‌సీ వైద్యాధికారుల సమ్మెకు సిబ్బంది మద్దతు

పెనుమంట్ర, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల ఓపి సేవలు బహిష్కరణకు వైద్య ఉద్యోగులు సంఘీభావం తెలిపారు. పెనుమంట్ర పీహెచ్‌సీ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదని, నేటి నుంచి అవుట్ పేషెంట్ సేవలను నిలిపివేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. టైం బాండ్ ప్రమోషన్ అమలు చేయాలని, ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో సేవలందించిన వైద్యులకు మూల వేతనం, గిరిజన భత్యం మంజూరు చేయాలని కోరారు. చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి భత్యం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణ, కె.మల్లేశ్వరరావు, ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, కె.భాగ్య కుమారి, సీహెచ్ మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

బ్యాంకులో మంటలు..

- వేగంగా స్పందించిన ఏలూరు ఫైర్ సిబ్బంది
- అప్రమత్తమైన స్థానిక పోలీస్ అధికారులు
- మంటలు అదుపు చేయడంతో అంతా సేఫ్

ఏలూరు క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకోగా ఫైర్ సిబ్బంది వేగంగా స్పందించి భారీ నష్టాన్ని నివారించగలిగారు. తాళాలు వేసి ఉన్న బ్యాంకులో పొగలు వెదజిమ్మడంతో అటుగా వెళ్తున్న వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో సిబ్బంది చాకచక్యంగా మంటలను అదుపు చేసి భారీ నష్టం జరగకుండా కాపాడగలిగారు. ఏలూరు శనివారపు పేట రోడ్డు సెయింట్ థెరిస్సా డిగ్రీ కాలేజీ (సెయింట్ ఆన్స్) కాలేజీలోని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో సోమవారం ఉదయం 8.15గంటల సమయంలో బ్యాంకు లోపలి నుంచి పొగలు రావడాన్ని ఎస్.సాయి అనే వ్యక్తి గమనించి అగ్ని మాపక శాఖకు ఫోన్ చేశారు. మూడు నిమిషాల్లోనే ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేయగలిగారు. సమీపంలోనే ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ నివాసం ఉండడంతో తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. అగ్నిమాపక శాఖ అదనపు జిల్లా ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణ, సిబ్బంది ఆ పొగలో ఆక్సిజన్ సిలెండర్ మాస్కులతో లోపలికి వెళ్లి మంటలు అదుపు చేశారు. త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు, వారి సిబ్బంది అక్కడకు చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.బ్యాంకులోని ఏసీ యూనిట్‌లో అగ్నిప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు. మరోవైపు బ్యాంకులో లైట్లు మినహా ఎలాంటి ఏసీలు ఆన్ చేయలేదని బ్యాంక్ మేనేజర్ టి.రాజాజీ చెబుతున్నారు. బ్యాంకులోని రెండు ఏసీలు, రెండు ఫ్యాన్లు, రెండు టేబుల్స్, గోల్డ్ వెయింగ్ మిషన్లు, స్టేషనరీ, మాత్రమే దగ్ధమైనట్టు గుర్తించారు. నగదు ఉన్న చెస్ట్ రూమ్, లాకర్స్ ఉన్న రూమ్‌లు భద్రంగా ఉన్నాయి. ఆ రూముల్లోకి ఎలాంటి మంటలు వ్యాపించలేదు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, బ్యాంకు ఉన్నతాధికారుల సమక్షంలో బ్రాంచ్ మేనేజర్ రాజాజీ తాళాలు తీసి పరిశీలించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, లాకర్లు భద్రంగా ఉన్నాయని స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఖాతాదారులు తమ లాకర్లను పరిశీలించుకోవడానికి బ్యాంక్ మేనేజర్ టి.రాజాజీ అనుమతించడంతో లాకర్లు ఉన్న వారు వచ్చి వాటిలో ఉన్న వస్తువులను చూసుకుని అంతా భద్రంగా ఉన్నాయంటూ వెళ్లారు. బ్యాంక్‌లో మూడు లక్షల రూపాయల విలువైన ఫర్నిచర్ దగ్ధమైనట్టు అంచనా వేశారు. మరో 47 లక్షల రూపాయల సొత్తును కాపాడుకోగలిగామని జిల్లా అదనపు ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ చెప్పారు.



లాకర్ రూమ్ పరిశీలిస్తున్న పోలీసులు

బావమరిది చనిపోయాడని వెళుతూ..

క్వారీ లారీని ఢీకొట్టి మోటార్ సైక్లిస్టు మృతి..

దేవరపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లారీని మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. దొమ్మేరు నుంచి విజయవాడకు దొడ్డినాగు మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై వెళుతున్నారు. యర్నగూడెం శివారు గండిచెరువువద్ద క్వారీ లారీ మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వేగంగా మోటార్ సైకిల్‌పై వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పోలవరం మండ లం కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన దొడ్డి నాగు(35) అక్కడికక్కడే మృతి చెందగా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన తాళ్ల అభిషేక్‌కు కాలు విరగడంతో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. విజయవాడ లో తన బావమరిది చనిపోయాడని తెలుసుకుని తన మేనమామ కుమారుడు తాళ్ల అభిషేక్‌తో మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. నాగుకు భార్య సీత, కుమార్తె రచిత, కొడుకు చరణ్ ఉన్నారు. నాగు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కామవరపుకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు యడవల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి చౌదిమెళ్ల అభినాశ్(18) మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మ హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తల్లి ఎప్పటి నుంచో కువైట్‌లో ఉంటోంది. అభినాశ్ సరిగా కళాశాలకు వెళ్లకపోవడంతో పని చేసేందుకు తల్లి కువైట్ రావాలని హెచ్చరించినట్టు సమాచారం. కువైట్ వెళ్లడం ఇష్టం లేకే ఇలా చేశాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టెట్ నుంచి ఇన్‌సర్వీసు టీచర్లను మినహాయించాలి

ఏలూరు అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకంటే ఎక్కువ సర్వీసు కలిగి, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అర్హత సాధించని టీచర్లు రెండేళ్లలో టెట్ క్వాలిఫై అవ్వాలని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్‌ను దాఖలుచేయాలని ఏపీటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. వాస్తవానికి 2011వ సంవత్సరానికి ముందే విధుల్లో చేరిన టీచర్లందరూ అప్పటి నిబంధనల ప్రకారం అమల్లో వున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష ద్వారా ఎంపికైన విషయాన్ని గమనించాలన్నారు. ఈ నేపథ్యంలో వారికి టెట్ అవసరం లేదని ఉత్తర్వులున్నాయన్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఉత్తర్వులపై మిగతా రాష్ట్రాల మాదిరిగానే ఏపీ ప్రభుత్వం కూడా రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసి, ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చలో ఢిల్లీకి ఏఐపీటీఎఫ్ పిలుపు

పెదవేగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్స్ అర్హత టెస్ట్(టెట్) నుంచి మినహాయింపు నివ్వాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసి యేషన్ (అప్టా)జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్.శివరామ్, ఎం.శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశంలోని ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తేనే పదోన్నతి ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఏఐపీటీఎఫ్ ఇచ్చిన పిలుపు మేరకు నవంబరు 24న ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ అప్టా ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. అప్టా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ 25 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు గూగుల్ మీట్‌లో పాల్గొని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారన్నారు. ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమించి, వచ్చే నెల 24న ఛలో ఢిల్లీ విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

పాలకొల్లు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు-నరసాపురం మెయిన్‌రోడ్డు దిగమర్రు వద్ద మోటారు బైక్‌ను ఆయిల్‌ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో కొల్లి మహేష్‌రాజు (18) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తణుకు పట్టణం పాతూరుకు చెందిన కొల్లి మహేష్‌రాజు, గాజులుపాటి సాయిగణేష్, కూచి చరణ్ శర్మ వీరు ముగ్గురు మంగళవారం తణుకు నుంచి బయలుదేరి పేరుపాలెం బీచ్‌కు మోటారు బైక్‌పై వెళుతున్నారు. పాలకొల్లు- నరసాపురం మెయిన్‌రోడ్డు దిగమర్రు వద్ద వీరి బైక్‌ను ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో కొల్లి మహేష్‌రాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గాజులుపాటి సాయిగణేష్, కూచి చరణ్‌శర్మ వీరిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో గాజులుపాటి సాయిగణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సేషన్ హెడ్ కానిస్టేబుల్ చింతపల్లి వెంకట నారాయణమూర్తి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



సామాజిక తనిఖీ సమావేశంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

ఉపాధి నిధులు రూ.3.20 లక్షల రికవరీకి చర్యలు

పాలకొల్లు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాల యంలో మంగళవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సమావేశం జరిగింది. మండలంలోని 27గ్రామాల్లో 2024- 25 సంవత్సరానికి నిర్వహించిన మొత్తం 702 పనులపై సామాజిక తనిఖీ నిర్వహించి సిబ్బంది లోపాలను గుర్తించాయి. ఎన్ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది నుంచి రూ.3,20,082 రికవరీ చేయాలని డ్వామా పీడీ సీహెచ్. చినఅప్పారావు ఆదేశించారు. కార్య క్రమంలో ఎంపీడీవో ఎస్.ఉమామహేశ్వరరావు, జిల్లా విజిలెన్స్ అధికారి కె.పురుషోత్తం, ఎస్‌టీఎం కె.కోనయ్య, ఏపీడీ పి.సుజాత, పీఆర్ ఏఈ వి.శ్యాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎన్ఆర్ఈ జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.